కథానిక:

# "మనుష్యులం"

శ్రీ వేలూరి సహజానందం

"మనమెవరం?" కాపరానికి కొత్తగా వచ్చిన కోమలాంగి భర్తతన్ను ఆలింగనంలోకి ఆహ్వానించకుండా ఇలా ప్రశ్నించేటప్పటికి నివ్వెరపోయింది. నుంచున్నదల్లా ఆలాగే నిలబడి పోయింది. సమాధానంకోసం, ఈ పురాతన, నిత్య ప్రశ్నకు, తాత్త్వికచింతతో తాను వేసినఏకైక ప్రశ్నకు ఆమెఇచ్చే సమాధానం కోసంఅతను చూస్తున్నాడు. ఆమె పెదవులు కదిల్చింది. కాని మాట పెగలలేదు.

"మనం పశువులం కాము" అన్నాడతనే.

ఆమె మనస్సుకొంచెం కుదటపడ్డది - సమాధాన భారంకూడా అతనే నెత్తిన వేసుకున్నందుకు. ఆమెకు తెలుసు— అతను యం. ఏ. ప్యాసయాడని, విపరీతమైన విద్యాసక్తి కలవాడని. ఎందరెందరకో తెలియని మహావిషయాలను భర్త మథిస్తున్నాడని గర్వపడేది. కాని అతనికంత చదువుండగా, తను విద్యావిహీనురాలవటంవల్ల మళ్లీ విచారంగానూ ఉండేది. అయినా అతనిసాన్నిధ్యంలో ఆలోటు తీర్చుకోవచ్చు.

అతనికేసి చూసింది. అతనిముఖంలో బిగువు కొంచెం సడలింది. పెదవులపై మందహాసంకూడా గోచరిస్తోంది.

అతను మెల్లగా అన్నాడు.

"నేను మీ నాన్నగారికి వ్రాశాను. ఈ రభసంతా నాకిష్టం ఉండదని, ఊరికేవస్తున్నానని. ఈ మల్లెలవాసన మనకు మత్తెక్కించకూడదు. ఈఅత్తరుల సువాసనలకు మనం చలించకూడదు. ఒకళ్లనొకళ్లంచూసుకొని ఉద్రిక్తులం కాకూడదు. వాళ్ల శాసన, ముహూర్తప్రకారం మనం ముద్దులు పెట్టుకోటానికి, కౌగిలించుకోటానికి వీలు లేదు."

మన్మథుని ఉద్యానవనపు మానాన్ని భంగం చెయ్యకతప్పదనే, అతను వరుసవరుసగా మన్మథునిపై ఉపన్యాసబాణాలు విసురుతున్నాడు. ఎక్కడదాగి ఉన్నాడో, ఆ మన్మథునికి వెళ్లితగిలినయో లేదో గాని, ఆమెకుమటుకు గందరగోళంగా ఉంది.

మెల్లగా బల్ల మీదనుంచి ఫలహారపు పళ్లెం తీసి, ఆమె అతన్ని సమీపించబోతోంది.

అతనందుకున్నాడు—ఉపన్యాసాన్ని.

"అమాయకురాలవునువ్వు! యజ్ఞపశువ్వి. నేర్పిన పాఠాలుబాగా అప్పజెప్పుతున్నావు. ఇంతకు మునుపే గొంతుకదాకా తిన్న నాకు క్షణంలోనే ఆకలిశోష రాలేదు, పెట్టు ఆ పళ్లెం... బల్లమీద."

ఆమె వెనకడుగువేసి నుంచుంది. పళ్లెం చేతుల్లోనే ఉంది. అతను నాలుగడుగులు ముందుకు వేసి ఆమెకు దగ్గరగావచ్చి. ఆమె భుజంమీద చెయ్యి వేయబోయి, వెనక్కుతీశాడు. అదిగ్రహించిన ఆమె మనస్సు చివుక్కుమంది. తనదైవానికి తనపైన అలుక వచ్చిందా? లేకవిద్యా విహీనురాలని తనపైవిరక్తా? ఆమె గుండె బాధతో కొట్టుకుంది.

తన క్షణచాపల్యానికి అతను చిన్నపుచ్చుకున్నాడు. సంకెళ్లలోంచి తప్పించుకొని చెయ్యి, పాపిష్టిచెయ్యి, గభాలున స్త్రీభుజాన్ని తాకపోయింది. అతనిలా చింతిస్తుండగానే, కళ్లు ఆమె పొడుగాటి జడకేసి తిరిగినయ్. పూలమధ్యజుట్టు కన్పించటం లేదు. వాటివాసనలు తనకి మత్తెక్కిస్తున్నయ్. తనంత పొడుగునా ఉంది ఆమె. అయోమయంగా ఉన్న ఆమెకళ్లలోకి చూశాడు.

"ఏం అలాచూస్తున్నావు?" అని అడిగాడు.

"క్షమించండి" అంది ఆమె.

"ఎందుకు?"

"అలా చూసినందుకు?" అని పళ్లెం బల్లమీద పెట్టింది.

అతనికి ఆశ్చర్యమూ నవ్వూ కలిగినయ్. నిజానికి ఆమె కళ్లుబాగా ఉన్నయ్. చూసినకొద్దీ చూడబుద్ధి వేస్తోంది. అంతేకాదు, తన చేతులు మళ్లీ ఆమెను తాకాలని రెండుమూడుసార్లు ఆరాటపడ్డయ్. కాని అతను నిశ్శబ్దంగా, అదృశ్యంగా ఝుళిపించిన కొరడా దెబ్బకు అవి వీపువెనకాలే మెలికలు తిరిగినయ్.

"కూర్చో" అని అతను మెల్లగా ఆమెను మంచంవైపు సైగచేశాడు.

"మంచి అందకత్తెవునువ్వు. ఈ ఆరునెలల్లో నీ అందం మఱింత ఎక్కువైంది. కాని...కాని" అని అతను ఆగాడు.

ఆమె రెప్పలు వాల్చకుండా అతనికేసి చూస్తోంది. అందంగురించి ప్రశంసించాడు. విశేషమే. కాని ఇంతలో మళ్లీ 'కాని' ఏమిటి?

"కాని... అందంకాదు ముఖ్యం...జ్ఞానం" అన్నాడు.

ఆమెకు ఏమీ పాలుపోలేదు.

తొలిరేయి తుపానులా ఉంటుందను కొంది. పరశరీర స్పర్శవల్లకలిగే సంభ్రమ, ఉద్రేకాలూ హించుకునికంపిస్తున్న ఆమె, భర్తధోరణిని చూసి కొంతనిలదొక్కుకుంది. వంటినరాలన్నీ పట్లు సడలినయ్. బైట వసారాలో కుతూహలంతో నిద్రరాని పెద్దలకు ఈ ఎడతెగని గుసగుసఏమీ బోధపడలేదు.

నిశిరాత్రి దాటింది. అతనికి మెలకువవచ్చి లేచి చూశాడు. చాపపైపరుంది ఆమె. అతను చింతిల్లాడు. తను మెత్తనిపరుపుపై... ఆమె వట్టిచాపపై. తను కూడా కిందే పడుకోవాలి. కాని మరొక చాపలేదు. వెళ్లిమెల్లగా ఆమె భుజాన్నితట్టాడు. ఈ తొలిస్పర్శ అతనికి చీకట్లో ఏదో తగిలినట్టుంది. ఆమె ఉలిక్కిపడి లేచింది.

"ఏం లేదు... కింద నేను పడుకుంటా... నువ్వుపక్కమీద పడుకో" అని అతను మెల్లగాచాపమీదకొరిగాడు.

నిద్రలేచి ఉషస్సు కళ్లుతెఱిచేసరికి ఆమెపతి పాదాల దగ్గరకూర్చున దల్లాలేచి మెల్లగా తలుపులు తీసుకొని ఇంట్లోకి వెళ్లిపోయింది.

౨

పని, పాట ముగించుకొని ఆమె భర్త పుస్తకాల గదిలోకి వచ్చింది. అతను ఏదోచదువుకో పోతున్నాడు. వెళ్లి, కిటికీతీసి, "ఏమిటండీ... అంత వెన్నెల అవతల వర్షంలా కురుస్తుంటె, కిటికీలు వేసుకుని కూర్చున్నారు?" అని ఆమె అంది.

అతనునవ్వి, "ఎక్కడో ఆకాశంలోంచి వస్తోంది ఆ వెన్నెల... చూడు ఈ పుస్తకంలో అంతకన్న మనస్సుకు ఆహ్లాదం కలిగించే పండువెన్నెల.." అని పేజీతిరగేశాడు.

కాసేపుండి ఆమె అంది.

"మీ పండువెన్నెల... మీరూను. మీపూలూ, ఆకాశం... నక్షత్రాలూ... చివరికి నేనూ... అన్నీ ఆపుస్తకాలే! మీరెక్కడ" అని కిటికీ కానుకొని నిలబడింది. ముడిఊడి, తలంటి పోసుకున్న జుట్టు, పిఱుదులవరకూ పడ్డది. గాలికి జుట్టురేగుతోంది. అతనికళ్లు అప్రయత్నంగా అక్షరాల మధ్యనుంచి ఒక్కసారి ఆ జుట్టువైపుకు గంతువేసినయ్. వెన్నెల ఆమె ముఖంపైపడుతోంది. పల్చని తెల్లని చీర వెనకనించి ఆమెపచ్చని శరీరం దాగుడు మూతలాడుతోంది.

"నిద్రరావట్లేదూ?" అని అడిగింది— భర్తతనకేసేచూస్తూంటటం చూసి కొంటెగా నవ్వుతూ.

దొంగలా పట్టుబడ్డ అతను, "ఊ! అప్పుడే... నీకువస్తుంటే వెళ్లిపడుకో... లేకకపోతే ఇదుగో... చదువుకో మంచినవల— అశరీరమైన ప్రేమనవల." అన్నాడు—

బలవంతంగా కళ్లను ఆమె మీదనుంచి పేజీవైపుకు మరలుస్తూ.

"అశరీరమైనప్రేమ... అశరీరంగా మనం జీవించి నప్పుడు, అశరీరప్రేమల గురించి చదువుదాం అయినా ఏమిటో ఈ పుస్తకాలు చదవటం. మనను గురించేకదా అందులో వ్రాసేది. మనంఎలా ఉంటున్నామో, మనకోపాలు, తాపాలు, ప్రేమలు, ద్వేషాలు... వీటినిగురించే, మన జీవితాల గురించే

కదా అక్కడ వ్రాసేది. జీవిస్తున్న మనకు అవి ఎందుకు? జీవించటం ఎరగని వారికిగాని" అని అంది ఆమె. ఆమెస్వరంలో చిలిపితనం, ఎత్తిపొడుపు అతను గ్రహించాడు.

"నువ్వెక్కడ... జీవితమంతా ఆమూలాగ్రం ఎగిరినదానివి...అయితే వెళ్లిపడుకో." అన్నాడు.

"నా ఒక్కత్తెకూ భయం" అంది ఆమె.

"చాలులే...ఇక... వెళ్లు" అని చదువులో పడ్డాడు మళ్లీ అతను.

ఆమె వెళ్లిపడుకుంది. ఇలా ఒంటరిగా వచ్చి పడుకోటం ఆమెకు అలవాటైంది. నిశిరాత్రిదాకా భర్త ఏదో ఒకటి చదువుతూనే ఉంటాడు. తర్వాత నిశ్శబ్దంగావచ్చి... విడిగావెళ్లి తనపక్కలో తాను పరుంటాడు. తనపై కోపమూ లేదు. చికాకూ లేదు. ఆ తొలిరాత్రికూడా తన్ను పక్కలో పడుకోమని, తాను చాపపైపరుంటానని అన్నాడు. తనతో సరిగానే మాట్లాడుతాడు. కాని అంతే... అంతా ఎడంగానే.

అతని దగ్గరకు వెళ్లాలని తనకు అనిపించినట్లు, అతనికి తనదగ్గరకు రావాలనిపించదూ? ఇందాక కిటికీ వద్దనుంచొని తను వెన్నెలలోకి చూస్తుంటే అతను తనకేసి ఓరగా తదేకంగా చూడటం గమనించింది. కాని వెంటనే తనదగ్గరకు వచ్చాడా? పోనీ తనను దగ్గరకు రమ్మన్నాడా? లేకపోతే తను పిలవగానే అలాగే అని గదిలోకి వచ్చాడా? లేదు... ఇదే తనకు అర్థమూ కావట్లేదు. తృప్తిగానూ ఉండట్లేదు. పోనీ తనమీద ఇష్టంలేదా అంటె, కాలేజీనుంచి అపాఠాలు చెప్పి రాగానే ఎక్కడికీ వెళ్ళడు. ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాడు. ఎవరూ స్నేహితులు కూడా రారు. మరి ఇదేమిటి?

అతనికి చదువు సాగట్లేదు. గాలికూడా కొద్దిగా వేస్తోంది. వెళ్లి కిటికీలు మూశాడు. మళ్లీ చదువారంభించాడు. సాగట్లేదు. ఆ అక్షరాలు అలుక్కుపోతున్నయ్. లేచి, దీపంతీసి గదిలోకి వెళ్లాడు.

నిద్రపట్టలేదు. నడిజాము తిరిగింది. చిన్న దీపం వేశాడు. ఆమె జుట్టు దిండంతా కమ్మింది. గాఢ నిద్రలో ఉందామె. దీపంతీసి పడుకున్నాడు. అతని మనస్సు చివుక్కుమంది. ఒంటరిగా ఆమెనిందాక తిప్పిపంపించి నందుకు నొచ్చుకున్నాడు.

అతని చెయ్యితగలగానే ఆమె ఉలిక్కిపడి లేచింది. "ఏం లేదు...పడుకో" అన్నాడు.

"ఇంతవఱకూ చదుతూనే ఉన్నారా?" అని అడిగింది ఆమె కళ్లు నులుపుకుంటూ.

"ఇందాకే వచ్చా... పడుకో" అని దీప మార్పాడు.

ఆమె కతనిశరీరం రాచుకొంది. అతని చేతులు మెల్లగా నడుమును చుట్టుతున్నయ్. ఆమెలో ఉద్రేకం హెచ్చింది.

"మన మెవరం?" అంది.

అతనేమీ మాట్లాడకుండా, ఆమెను దగ్గరగా హత్తుకుంటున్నాడు.

"పశువులం కాదు, మనకు ముఖ్యం జ్ఞానం" అని హఠాత్తుగా లేచికూర్చుంది. ఆమె స్వరంలో పరిహాసం లేదు.

అతను లేచి కింద నిలబడ్డాడు. ఆమె మాటల కతని ముఖమంతా ముడతలు పడుతున్నట్టుంది. తల తిరిగిపోతోంది. రోషాభిమానాలతో శరీరం కంపిస్తోంది. చీకట్లోతబడుతూ పుస్తకాల గదిలోకివెళ్లాడు.

తన పతనానికి తానుసిగ్గు చెందాడు. కిటికీ తలుపులు తీశాడు. జగత్తుఅంతా వెన్నెల్లో మునిగి ఉంది. తనే ఎడారి ఒడ్డునదిక్కులు చూస్తున్నాడు. ఇంటింట అంతామై మఱచిఉన్నారు. తనే కఠోరమైనా జాగరణతో పొద్దుపుచ్చుతున్నాడు. మళ్లీ కిటికీ వేసి, వచ్చి పుస్తకం తెఱచాడు. పేజీల మధ్య నలిగిన ఈగ ఒకటిజారి కిందపడ్డది.

## 3

"ఏమింటికా... ఆ వంటింట్లోనే"

"బాగుంది... ఇరవై నాలుగు గంటలూ, మీకెదురుగా కూర్చుంటె, ఇక్కడపని ఏ పెద్దమ్మ చేస్తుంది?" అంది ఆమె వంటింట్లోంచి.

"ఎప్పుడూ పని... పని... రాత్రి తొమ్మిది దాటినా ఆపనికి అంతు అంటూ ఉండదు. రేపు పొద్దున చేసుకోవచ్చు లేద్దూ" అని బతిమాలాడతను.

ఆమె మాటాడకుండా పనిచేసుకుపోతోంది.

"నిన్నే... మళ్ళీ ఏదో పనిలో పడ్డావు." అని పిలిచాడు."

"ఊఁ... అయితే ఉండండి... చేతిలో పని అవాలా? వస్తున్నా లెండి... పట్టిం దేపట్టు" అని ఆమె వంటింటి తలుపులు వేసి గదిలో అడుగు పెట్టింది.

"పదవస్తోంది. ఇంక నిద్ర అక్కర్లేదు గావును. రా" అని పురమాయించాడతను — ఆమె కుర్చీలో కూర్చోబోతుంటె. ఆమె అతని దగ్గరకు వెళ్ళి "ఊఁ! ఏమిటి చెప్పండి?" అని అడిగింది కొంటెగా.

"ఏం లేదు గాని... మంచిదానివి... ఆ విద్యుద్దీపం తీసేద్దూ" అన్నాడు.

"ఇంకా పదన్నా కాలేదు. అప్పుడే లైట్లార్పటమా! బొత్తిగా చదువూ సంధ్య లేదు. ఇక నిశిరాత్రైనా నను నిద్రపోనీయరు గావును... అదిగో... చెప్తున్నా... మీ వేళ్ళు అల్లరి ఆరంభించినయ్." అని జడ నివతల వైపుకు లాక్కుంది.

ఆతను పమిట సర్దబోయాడు.

"సరిగా ఉన్న పమిటను సర్దరావటం ఎందుకండీ" అని, ఆమె మెల్లగా ఆరంభించింది.

"అప్పుడే బాగుంది. ఆరోజులే బాగున్నయ్. హాయిగా నిద్రైనా పోయేదాన్ని... ఇప్పుడు పన్నెండైనా నిద్రపోనీయరయ్యె. మరిమీరూ ఆకాలేజిలో ఆ సన్నాసులకేం చెప్పుతున్నారో! పుస్తకం పుచ్చుకొని ఎన్నాళ్ళయింది మీరు? నిజం చెప్పండి.. నా ఊపిరితీయక, కాస్త మళ్ళీ చదువారంభించండి... పుస్తకాలు తెచ్చి పెట్టుతాను." అని అంది.

"అదంతా అప్పుడు విద్యార్థి(?) శ్రమం... ఇప్పుడు గృహస్థాశ్రమం" అన్నాడతను.

"అలాగా.... చూద్దాం" అని ఆమె గబగబా పుస్తకాల గదిలోకి వెళ్ళి రెండుమూడు పుస్తకాలను తెచ్చి, వాటి మీద దుమ్మును. ఉఫునఊది అతని ముందు పెట్టింది.

అతను అందుకున్నాడు.

"ఆ! మనను గురించేగా వ్రాసేది ఆ పుస్తకాల్లో జీవితాన్నెరుగని వాళ్ళకు గాని మనకు ఎందుకు పుస్తకాలు?" అని అతను చటుక్కున దీపమార్పాడు.

"బాగానే ఉంది. ఇలా అయితే కాలేజీలో ఉద్యోగం సాగినట్లే!" అని ఆమె మెల్లగానడుం వాల్చింది.

ఇద్దరిమధ్య చీకటి కమ్ముకుంది.

ఆతనామెను గట్టిగా హత్తుకుంటూ, "మనమెవరం?" అని అడిగాడు.

"దేవతలం" అంది ఆమె.

"కాదు మనుష్యులం" అన్నాడతను.

"నిజం?.... ఇన్నాళ్ళుపట్టింది అబ్బాయిగారికా విషయం తెలుసుకోటానికి... మళ్ళీ ప్రొఫెసరుట ప్రొఫెసరు." అని దగ్గరగా జరిగిందామె.

పక్కహాలు ఊయ్యాల్లో పసిపిల్లడు కంగారుగా లేచి, కెవ్వున ఏడ్వ ఆరంభించాడు.

దీపం వేసి, కళ్ళు నులుపుకుంటూ, బూజుపట్టిన పుస్తకపు పేజీలు మెల్లంగా తిరగేస్తున్నాడతను.

